# 21. కళా సేవా దురద

కళాసేవ అనేది ఈ అణుయుగంలో ఓ మాడర్న్ దురదగా రూపొందింది. అకాడమీలు పుట్టాక గోకినకొద్దీ పెరిగే సుప్రసిద్ధ రోగంగా సదరు దురద స్థిరపడి పోయింది. అందువల్ల సహజంగానే మన కళారంగాలన్నింటా ఈ దురద గోడ్లే ప్రత్యక్షం. వారే ప్రముఖులు: వారు మెచ్చిన దురదే కళ: వారికినచ్చిన పుళ్ళే కళాఖండాలు.

ఈ దురదగోడ్లను దృష్టిలో ఉంచుకునే కాబోలు వెనకటికో పెద్ద మనిషి "కళోద్ధరణకై మనం చేయవలసిన త్యాగములెవ్వి" అనే ప్రశ్నకు సమాధానంగా "వాటి జోలికి పోకుండుటయే!'' అని సెలవిచ్చాడు.

'కళ' అనగా చిలుంపట్టిన తప్పేలాలకు కళాయివేయుంచుట' అని నిర్వచించగల కళా సుబ్బిశెట్ల రాజ్యం మనది. కళనో త్రాసులో, చింతపండును మరో త్రాసులో వేసి మరీ సునాయాసంగా ఖరీదు కట్టేయగల కళాయి షరాబుల చిలుం సమాజం మనది. కనుక పై సమాధానం ఇచ్చిన పెద్దమనిషి నిజాయితీని మనం సులభంగానే గ్రహించగలం.

'పూర్వం ప్రభువులే కళాపోషకులు. ప్రస్తుతం ప్రజలే ప్రభువులు గనుక వారే కళాపోషకులు" అని సుబ్బిశెట్టిగారి గుమాస్తాల్లాంటి కళాకారులు కొందరదపా దడపా ప్రవచి

స్తూంటారు. వారు అనుభవజ్ఞులూ, బ్రతక నేర్చినవారూనూ. పెళ్ళికో పంచరత్నం, తద్దినానికో సంగీత కచేరీ, సమర్తకో డాన్సు ప్రోగ్రాం సాగించి, ఆ వచ్చిన తండులాలతో సంసారం నెట్టుకు రానేర్చిన అదృష్టవంతులు వాళ్ళు.

వీరి సంగతెలాఉన్నా ప్రస్తుతకాలంలో నిజమైన కళాపోషకులు బ్లాక్ మనీ దండిగాగల పనిలేని మంగళ్ళేననేది మాత్రం భోస్లా కమిటీకూడా కాదనలేని నిజం.

అడ్ హాక్ కమిటీలోనేగాదు, కళా సంస్థల్లోనూ వీరే ప్రముఖులు-సుబ్బిశెట్టిని అడ్ హాక్ కమిటీలోనో తద్దినపు భోక్తల కమిటీల్లోనో మెంబరుగా వేస్తే అందులో విశేషం ఏమీలేదు. బొజ్జగల శతభోక్తల్లో వీడూ ఓ భోక్త అవుతాడంతే. అందుకని ఎంతో కొంత చింత పండో, బెల్లమో భూరి విరాళంగా పుచ్చుకుని కళాసంస్థల పెద్ద పీటలు సదరు సుబ్బిశెట్లకు రిజర్వుచేయడం సత్సాంప్రదాయమయిపోయింది.

ఈ విషయంలో వీరికి పోటీదారులెవరూ లేరు. తెల్ల టోపీ పెట్టుకుని, టోపీలు వేస్తూ కాలక్షేపంచేసే నిక్షేపరాయుళ్ళు తప్ప. వీళ్లకివి అలంకారాలుగాకాక అవసరాలుగానే తయారయ్యాయి.

ఈ కళాసేవకులు (ప్రభుత్వం వారు ఉదారంగాయిచ్చే గ్రాంట్లతోనే అనుకోండి) ఘనంగా కళా సంతర్పణలు చేయిస్తుంటార డపాదడపా! అమాయకులు విస్తళ్ళు వెదుక్కుంటూంటే వీళ్లు మాత్రం సదరు సంతర్పణలకు ప్రారంభోత్స

వం చేయనే తెంచిన టోపీదాసుతో లావాదేవీలు సరిజేసుకుంటూంటారు.

"చూడండీ! మేమెందరికి ఇలానిత్యం కళాన్నదానాలు చేస్తున్నామో! వచ్చే ఏడాది సంతర్పణలకు మీరు రెట్టింపు గ్రాంటివ్వాలి సుమండీ! అన్నట్లు మరచేపోయాను. మా బామ్మర్దిగాడు మొన్నే మెట్రిక్ పరీక్షరాశాడు. ప్యాసవుతాడు లెండి. పేపర్లుదిద్దేవాళ్లు కొందరీ సంతర్పణలోనే ఉన్నారు మార్కులు వెయ్యక చస్తారా. మీరు మాత్రం మర్చిపోకుండా మీ డిపార్టుమెంటులో మా వాడిని ఆఫీసరుగా వేయించాల్సిందే!" అంటూ ఇల్లు చక్కబెట్టుకుంటుంటారు.

ఈ బాపతు కళా సుబ్బిశెట్టిగార్నొకర్నా మధ్య ఓ అమాయకుడు ఇంటర్వ్యూ చేస్తూ "మీకు ప్రత్యేకాభిమానం గల సృజనాత్మక కళ ఏమిటండీ?" అని ప్రశ్నించాట్ట! అందుకా మహానుభావుడు పిర్రగోక్కుంటూ "ఇన్‌కంటాక్స్ లెక్కలు తయారు చేయటం" అని సెలవిచ్చాట్ట తడుముకోకుండా!

ఇదేదో జోక్ అనుకోనక్కర్లేదు. ఈ బాపతు సృజనాత్మక కృషి మన అకాడమీల్లోనే జాస్తీగా వుందని ఆమధ్య ఘనమైన ఏలినవారే ఖోస్లా కమిటీని వేశారు, విచారించమని.

సదరు ఖోస్లా కమిటీ వారి మధ్య ఘనమైన మన భాగ్యనగరానికి ఏతెంచారు ఇక్కడి కళా సుబ్బిశెట్ల పరిచయం పొంది ధన్యులమవుదామని. వారి గౌరవార్థం ఓ అకాడమీ అధ్యక్షుల వారు విందుచేసి తనకు ఇష్టులైన కాళాకారులను కూడా కొందర్ని పిలిచేరు; సదరు అధ్యక్షులవారి ఇష్టులైన

కళాఖండ నిర్మాతల్లో ఇద్దరికి ఒకరంటే మరొకరికి పడదు; అందుకని ఒక కళాఖండం ఎంత చింతపండుకు సమానం అనే సరదా చర్చరాగా వారిద్దరూ వాదోపవాదాల్లోపడి తిట్టుకున్నారు.

ప్రేమ పెళ్ళితో సమాప్తం అన్నట్లు మన వాదోపవాదాలు కూడా తన్నుల్తోనే గదండీ ముగిసేది. అలాగే వారిద్దరూ చివరకు "నీకేం తెల్సురా ముసలికుంకా!" అంటే "నీకేం తెల్సురా కుర్రకుంకా? అరకిలో చింతపండు అయిదు కళా ఖండాలకు సమానంరా?" అనుకునే దాకా వచ్చి ఆఖరికి వారిలో ఒకరు ఫోర్కూ, మరొకరు రొట్టెలచాకూ తీసుకుని ఒకరిమీదొకరు లంకమీది కెగిరిన అంజనేయుల వార్లలా లంఘించేరట.

దాంతో బెదిరిపోయిన ఖోస్లా కమిటీవారు "అయిదరాబాధులో చాలామంది ఉత్సాహవంతులైన విప్లవ కళాకారులున్నారు!" అనుకుని విమానం ఎక్కేశారు. ఇది మన తెలుగు కళాకండముల రంగముకే గర్వకారణం గదా!

ఇది ఓపిగ్గా చదివినవారిలో కొందరు అమాయకులు అనుకోవచ్చు "ఈ కబుర్ల రాయుడికి మన కళాఖండముల రంగము మీదా, ఘనమైన మన మహత్తర కళాకండముల రచయితలమీదా ఏదో కసి ఉన్నట్లున్నదే!" అని.

నిజమే! ఈనాటి ఈ కృత్రిమ విలువల కృతక కళల మీద కసిలేని వారెవరేనా ఉండగలరా?

ఉంటే మాత్రం వారి ఆరోగ్యాన్ని గురించి అనుమానించవలసిందే! బాధపడవలసిందే!

(జూన్ 1973)